క్లుప్తంగా

వధూవరులకు ఎమ్మెల్యే తాటిపర్తి ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పుల్లలచెరువు: మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో గురువారం రాత్రి జరిగిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఉడుముల పిచ్చిరెడ్డి కుమారుడి వివాహ కార్యక్రమంలో యర్రగొండపాలెం శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని వధూవరులు నాగార్జునరెడ్డి, లోకేశ్వరిలను ఆశీర్వదించారు. ఈయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాస రెడ్డి, నాయకులు రోశిరెడ్డి, గోవిందరెడ్డి, కోటేశ్వరరావు, ఎల్.ప్రసాద్, యాకోబు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

దర్శి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 450 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన కార్యక్రమం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పానుగంటి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు లేకుండా ప్లేట్లు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. సెక్రటరీ బోయెల్ల నాగేశ్వరరెడ్డి, కోశాధికారి అంబవరపు నారాయణరెడ్డి, రోటరీ సభ్యులు అలవల అంజిరెడ్డి, వెన్నపూస పేరిరెడ్డి, రెడ్డిమాసు శ్రీను, మారం శివకోటిరెడ్డి, మిల్లర్ బుజ్జి, కర్లా రమణారెడ్డి, సీహెచ్ రాజారెడ్డి, కంచర్ల వెంకట్రామిరెడ్డి, కొల్లా ఉదయ్‌భాస్కర్, కొత్తమారం సత్యనారాయణరెడ్డి, ఎదురు నారాయణరెడ్డి, కొల్లా భాస్కర్ పాల్గొన్నారు.



శిథిలావస్థలో ఉన్న సాగర్ కాలువ బ్రిడ్జి



ఊడిన రెయిలింగ్

పూడిన మేజర్లు.. శిథిలావస్థలో బ్రిడ్జిలు!



కాలువ కట్టపై నిండిన కంపచెట్లు



జమ్ముతో నిండి కనిపించని మైనర్ కాలువ

కురిచేడు: నాగార్జున సాగర్ కుడి కాలువకు సాగు నీరు అందించామని ప్రభుత్వం, అధికార పార్టీ నాయకులు చంకలు గుద్దుకుంటున్నారు. కానీ మేజర్లు, బ్రిడ్జిల నిర్వహణ గురించి పట్టించుకోవడం లేదు. మేజర్లు, మైనర్లు చెట్లు, గడ్డితో పూడిపోయి నీరు ప్రవహించేందుకు అవకాశం లేకుండా ఉంది. బ్రిడ్జిలు పెచ్చులూడిపోయి, రైలింగ్ గోడలు కూలిపోయి శిథిలావస్థకు చేరాయి. కట్టలపై కంపచెట్లు పెరిగి నడిచేందుకు కూడా అవకాశం లేకుండా ఉంది. మండలం పరిధిలో ప్రధాన కాలువ, దర్శి బ్రాంచి కాలువ, పమిడిపాడు బ్రాంచి కాలువలు వాటి పరిధిలో మేజర్లు ఉన్నాయి. సాగుకు నీరు ఇవ్వక పోవడంతో వాటి నిర్వహణ లేక చెట్లతో పూడిపోయాయి. కాలువకు, పొలాలకు తేడా లేకుండా పోయింది. ప్రధాన కాలువ, బ్రాంచి కాలువల్లో చెట్లు పెరిగిపోయాయి. కొన్నిచోట్ల కాలువ కట్టల మట్టిని తరలించటంతో పాటు కట్టల పక్కన కాలువ లోతులో మట్టిని తవ్వి తరలించారు. దీంతో కట్టలు బలహీనపడ్డాయి. అయినా కూడా సిబ్బంది కొరతతో పట్టించుకునే వారు లేక సాగర్ కాలువ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. నీటి సరఫరా ఇచ్చినా వాటిని రైతులు పంట పొలాలకు తరలించుకోవాలంటే రైతులు ఎంత శ్రమించినా చుక్క నీరు కూడా పొలాలకు వెళ్లే అవకాశం లేదు. ఎన్ఎస్‌పీ శాఖలో నిధులు లేక నిర్వహణ అటకెక్కింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన మేజర్లు, బ్రాంచి కాలువల్లో కంపచెట్లు తొలగించటం, పూడిక తీత పనులు చేపట్టకపోతే కాలువకు నీరు ఇచ్చినా ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. కలెక్టర్, ఎన్ఎస్‌పీ అధికారులు కాలువ కట్టలపై తిరిగి పరిశీలించి రైతుల సమస్యలను గుర్తించి వెంటనే మేజర్లకు, బ్రాంచి కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

వాన కోసం ఎదురు చూపులు



సాగుకు సిద్ధం చేసిన పొలం



షేడ్‌ల్లో ఏపుగా పెరిగిన మిర్చి మొక్కలు

పుల్లలచెరువు: మండలంలోని రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. రైతులు పంటలను సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. ఇదే అదునుగా మిర్చి షేడ్‌ల్లో మిరపనారు కూడా ఏతకు వచ్చి సిద్ధంగా ఉంది. వర్షాలు లేకపోవడంతో రైతులు పొలాలను సిద్ధం చేసుకుని ఉన్నారు. ఈ నెలలో మాఘ కార్తె వస్తే మిర్చి మొక్కలు నాటేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. కానీ వర్షం జాడ లేకపోవడంతో పంటలను ఎలా సాగుచేయాలనే ఆలోచనలో రైతులు ఉన్నారు. కొన్ని గ్రామాల్లో వర్షాలు పడినప్పటికీ పదును వర్షం లేకపోవడంతో వారు కూడా సంసిద్ధంగా లేరు. మండలంలో ఉన్న మిర్చి షేడ్‌ల్లో వేసిన నారు పూర్తి స్థాయిలో నాటడానికి సిద్ధంగా ఉందని యజమానులు పేర్కొంటున్నారు. వర్షం లేకపోతే తాము పూర్తిగా నష్టపోతామని వాపోతున్నారు. గ్రామాల్లో వర్షం కోసం ప్రత్యేక పూజలు, గ్రామదేవలకు నీళ్లు పోసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

పండ్ల తోటల విస్తీర్ణం పెంచడమే లక్ష్యం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

తాళ్లూరు (దర్శి): పండ్ల తోటలు పెంచడమే లక్ష్యంగా బత్తాయి, జామ, నిమ్మ, బొప్పాయి వంటి పంటలు ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, ఉద్యాన శాఖాధికారి ఎం. రవివెంకన్నబాబు సూచించారు. మండలంలోని మాధవరంలో ఉద్యాన పంటలు వేసిన రైతులతో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా వివరాలు సేకరించి పంటలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు, రవివెంకన్నబాబు మాట్లాడుతూ నీటి వనరులు దృష్టిలో పెట్టుకుని పండ్ల తోటలు లక్ష్యంగా సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చన్నారు. రాయితీలో అరటి 20 హెక్టార్లు, బత్తాయి, నిమ్మ 17.5 హెక్టార్లు, కూరగాయలు 25 హెక్టార్లు, ఫామ్‌పాండ్స్ 7, మినీ షేడ్‌నెట్లు 1.5 ఎకారాలు, ట్రాక్టర్‌లు 6, హార్టికల్చర్ కలెక్షన్ సెంటర్ 1, పాక్ హౌస్‌లు 3, తైవాన్ స్ప్రేయర్‌లు 28 ఉన్నాయన్నారు. వివిధ రకాల శిక్షణలో తాళ్లూరు, దర్శి, ముండ్లమూరు పరిధిలోని రైతులు పాల్గొని ఈ అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు.

పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ



పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

బేస్తవారిపేట: పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి. బాలాజీనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లిలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పంట సాగు రైతులకు మద్దతు ధర, ఉచిత పంటల బీమా, పంట నష్ట పరిహారం అందాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయించుకుని ఉండాలన్నారు. వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, వీఏఏలు పాల్గొన్నారు.

కంభం: మండలంలోని కందులాపురంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయాధికారి డి.స్వరూప పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు రైతులు 1500 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేసుకున్నారన్నారు. ప్రధానంగా సజ్జ 250 ఎకరాలు, కొర్ర 300 ఎకరాలు, కంది 150 ఎకరాలు, నువ్వులు 200 ఎకరాలు, పత్తి 150 ఎకరాలు ప్రధానంగా సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, బీమాలకు అర్హులవుతారన్నారు. రైతులు తాము వేసుకున్న పంటలను తప్పని సరిగా ఈ–పంటలో నమోదు చేసుకోవాలని కోరారు. ఏఈఓ పాపరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మహ్మద్

అర్ధవీడు (బేస్తవారిపేట): వరి నారు నాటుకునేటప్పుడు 20–30 సెంటీమీటర్లు కాలిబాటలు వదులు కోవడంతో గాలి, వెలుతురు బాగా సోకుతుందని వ్యవసాయాధికారి షేక్ మహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని అర్ధవీడులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కాలిబాటలతో ఎరువులు, పురుగుమందులు, కలుపునివారణ మందులు పొలంలో సమానంగా సులభంగా చల్లుకోవడానికి, పొలంలో తిరిగి పైరు పరిస్థితి తెలుసుకోవడానికి, చీడపీడల ఉధృతిని తగ్గించడానికి ఉపయోగపడుతుందన్నారు. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ జీవ శిలీంధ్రనాశిని ఉపయోగించి విత్తన శుద్ధి చేసుకోవడంతో వేర్లు, ఆకులపై వచ్చే బూజు తెగుళ్ల బారినుంచి రక్షణ పొందొచ్చన్నారు. సూడోమోనాస్‌లో రసాయనంలో నారు కట్టలు రెండు గంటలు నానబెట్టి నాట్లు వేయడంతో 20–30 రోజుల వరకు తెగుళ్లను అరికట్టవచ్చునని తెలిపారు. వీఏఏలు మౌనిక, రవికాంత్ పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు



త్రిపురాంతకంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్



దర్శిలో పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ



పూజలందుకుంటున్న గుంటి గంగాభవాని అమ్మవారు

త్రిపురాంతకం: శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. త్రిపురాంతకం ఆలయాలకు శ్రావణ మాసంలో వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో ఆలయాల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి రోజూ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, గోత్ర నామార్చనలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు అభిషేకం జరుగుతున్నాయి. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్నారు. ప్రత్యేక రోజుల్లో స్వామి అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

పెద్దదోర్నాల: సర్వ శుభాలతో పాటు అష్ట ఐశ్వర్యాలను ప్రసాదించే శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని మండల ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ మాసపు రెండో శుక్రవారంలో భాగంగా మహిళలు ఇష్టదైవాలను దర్శించుకుని లక్ష్మీవ్రతం చేసి నోములను నోచుకున్నారు. శుభప్రదమైన శుక్రవారం రోజు ఉదయాన్నే మహిళలు నిద్రలేచి స్నాన ఘట్టాలను ముగించుకుని దేవాలయాలకు చేరి పూజలు చేశారు. పసుపు, కుంకుమ కర్పూరీలిక వస్త్రం పూలు, పండ్లు, ఆకులతో వాయనాలను అందుకుని నిత్యసుమంగళిగా ఉండాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయం, గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, నీలంపాటి అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేక పూల అలంకరణ చేసి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రావణ మాసం ఎంతో ప్రీతి ప్రతమైన మాసం. ఈ మాసంలో స్త్రీలు సౌభాగ్య దాయకమైన వ్రతాన్ని చేసి నోములను నోస్తే అంతా శుభమే జరుగుతుందని నమ్మకం. పవిత్ర సంకల్పంతో అమ్మవారికి భక్ష్య బోనాలను నివేదిస్తే అమ్మవారి కటాక్షంతో సహా సౌభాగ్యాలు కల్గుతాయని శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆలయ అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు తెలిపారు.

దొనకొండ: మండలంలోని గ్రామాల్లో శ్రావణ మాసం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆనంద ఆశ్రమంలో వెలసిన శ్రీ గోవిందమాంబ వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. స్త్రీలు తలంటి స్నానాలు చేసి ఉదయం 6 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యావాచనం, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలో, వరలక్ష్మీ వ్రతం కుంకుమ పూజలు, అష్టోత్తరలు, లలిత సహస్రనామం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి వినుకొండ ఆంజనేయ శాస్త్రి నైవేద్యాలు చెల్లించారు. భక్తులకు భైరవానంద స్వామి తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

దర్శి: పట్టణంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతంగా చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు తెల్లవారు జామునే తలంటు స్నానాలు చేసి లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, నివాసాల్లో వ్రతాలు చేసుకున్నారు. పట్టణంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారు జామున అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు చేశారు. అమ్మవారిని అందంగా అలంకరించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగ ఆలయంలో..

ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మవారి ఆలయంలో అమ్మవారికి తెల్లవారు జామునే ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అమ్మవారిని అందంగా అలంకరించారు. అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ముండ్లమూరు: వరలక్ష్మీ వ్రతం వేడుకలు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు ఉపవాసములు ఉండి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పెద ఉల్లగల్లు, పులిపాడు, ముండ్లమూరు, మారెళ్ల, పోలవరం, ఈదర గ్రామాల్లోని ఆలయాలను సందర్శించి స్వామి వార్లకు అభిషేకాలు చేశారు. ఆలయ పూజారులు సహస్రనామార్చన చేసి వరలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొంతమంది మహిళలు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ఆశీర్వచనాలు అందుకున్నారు.



కనకదుర్గమ్మ ఆలయంలో అన్నదానం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఆనంద ఆశ్రమంలో అన్నదానం



పెద్దదోర్నాలలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



పెద్దదోర్నాలలో వాయనాలు అందుకుంటున్న మహిళలు



త్రిపురాంతకం అమ్మవారి ఆలయంలో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



ముండ్లమూరు: పెద ఉల్లగల్లులో..

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు

ముండ్లమూరు: మండలంలో వాయిదా పడిన పాఠశాల ఎస్ఎంసీ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తల్లిదండ్రులు సహకరించాలని ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు కోరారు. మండలంలోని చిన ఉల్లగల్లు, రెడ్డినగర్, సుంకరవారిపాలెం, పలుకురాళ్ల తండా పులిపాడు తండా గ్రామాల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహణ కోసం తగిన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు విద్యార్థులు, వారి తల్లింద్రులు సహకరించాలని కోరారు.

బీజేపీ నాయకులపై దాడి అమానుషం



దాడిని ఖండిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: స్థానిక బీజేపీ నాయకులు షేక్ మస్తాన్‌వలి, రాజశేఖర్, పీరయ్యలపై గురువారం రాత్రి టీడీపీ నాయకులు చేసిన దాడి అమానుషమని, ఈ దాడిని ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. పార్టీలో చేరిన వ్యక్తులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటం సరైన పద్ధతి కాదన్నారు. ఈ సదర్భంగా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐ సురేష్‌ను బీజేపీ నాయకులు కోరారు.



రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత

ప్రాణాలతో చెలగాటం



రహదారిపై ఉన్న గుంతలో దిగి ప్రమాదానికి గురైన కారు

కొమరోలు: ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అమరావతి–కడప రాష్ట్రీయ రహదారి కొమరోలు మండలం పొట్టిపల్లె గ్రామం వద్ద భారీ గుంత ఏర్పడింది. దీనిలో ఇప్పటి వరకు ఎంతో మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. నెల రోజుల క్రితం మెయింటెనెన్స్ వర్క్ కింద ఆ భారీ గుంత ఉన్న ప్రదేశంలో ఆర్అండ్‌బీ అధికారులు గ్రావెల్ తోలించి చదును చేయించారు. నెల తిరగక ముందే ఆ గుంతలో పోసిన గ్రావెల్ వర్షం కారణంగా కొట్టుకుపోవడంతో పాటు ఆ గుంత మరింత పెద్దదిగా మారింది. సాఫీగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డులో అనుకోకుండా పెద్ద గుంత ఉండటంతో వేగంగా వెళ్తున్న వాహనాలు గమనించక లోతు గుంతలో దిగడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.